క్లుప్తంగా

ఇన్‌చార్జి లేబర్ అధికారిగా వినయ్‌కుమార్



రేపల్లె రూరల్: రేపల్లె ఇన్ చార్జి లేబర్ అధికారిగా వినయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరులో అసిస్టెంట్ లేబర్ అధికారిగా విధులు నిర్వహిస్తూ రేపల్లెలో అదనపు లేబర్ అధికారిగా విధులు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారి శివప్రసాద్ తెనాలి బదిలీపై వెళ్లారు.

2న యార్డు నూతన భవనానికి భూమి పూజ

రేపల్లె రూరల్: పట్టణంలోని మార్కెట్ యార్డులో నూతన మార్కెటింగ్ యార్డు కమిటీ పరిపాలన భవన నిర్మాణానికి ఈ నెల 2న భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ కార్యదర్శి జీ.వేణుగోపాల్‌కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌లు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మార్కెట్ యార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రైతు భరోసా కేంద్రాల్లో జాబితాల ప్రదర్శన



చెరుకుపల్లి: మండలంలో రబీసాగుకు సంబంధించిన పంట నమోదు కార్యక్రమం పూర్తి చేసి రైతుల పేర్లను ఆయా గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు మండల వ్యవసాయాధికారి టి బాలాజీ గంగాధర్ తెలిపారు. కావూరు రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం రైతులతో మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 3 వరకు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద గ్రామ సభలు నిర్వహించి రబీ పంట నమోదు చేసుకున్న రైతుల పేర్లు ప్రదర్శించటం జరుగుతుందన్నారు. దీనిపై అభ్యంతరాలు ఉన్నట్లయితే 5వ తేదీ లోపు ఆయా గ్రామ రైతు భరోసా కేంద్రాల వద్ద సరి చేసుకోవాలని ఏవో సూచించారు.

ఇంటర్ పరీక్షకు 27 మంది గైర్హాజరు

చెరుకుపల్లి: మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షకు 27 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎగ్జామ్ సూపరింటెండెంట్లు ఆర్ మరియదాసు, హరికృష్ణలు శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలో కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 274 మంది విద్యార్థులకు గానూ 19 మంది గైర్హాజరు కాగా గుళ్లపల్లి ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాలలో 258 మంది విద్యార్థులకు గానూ 9 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు.

హైందవ ధర్మాన్ని కాపాడుకుందాం



చెరుకుపల్లి: హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ అన్నారు. మండలంలోని గుళ్లపల్లి శ్రీ నూకాలమ్మ దేవస్థాన ఆవరణలో శుక్రవారం చెరుకుపల్లి మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడటంతో పాటు హిందూ ధర్మ రక్షణ కోసం సమరసత ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. హిందువులు అంతా ధర్మనిధి సభ్యులుగా చేరాలని కోరారు. ఈ నెల 6, 20వ తేదీలలో ఏకాదశి నగర సంకీర్తనలు, 10న సత్సంగ కార్యక్రమాలు, 24న మాఘ పౌర్ణమి సందర్భంగా దేవాలయాల్లో సామూహిక హారతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ధర్మనిధి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా కన్వీనర్ తాడివాక తిరుపతమ్మ, ఫౌండేషన్ సభ్యులు పడమట వెంకటేశ్వరరావు, ఓగిరాల వీరాస్వామి, ఉల్లంగుంట సాంబశివరావు, ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో నూతన శకానికి నాంది

ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను ప్రజల వద్దకు తీసుకువచ్చారని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. తుమ్మలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి స్థానిక సర్పంచ్ దబ్బుకూటి ఏడుకొండలుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో వివిధ శాఖలకు సిబ్బందిని నియమించి ప్రజా సమస్యలను స్థానికంగానే పరిష్కరించే విధంగా గ్రామాలలో పరిపాలన సాగుతుందని చెప్పారు. గతంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక రాజకీయ నాయకులను సంప్రదించి మండల స్థాయి అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని ఇప్పుడు గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. ప్రతి 50 ఇళ్లకు ఒక గ్రామ వాలంటీర్‌ను ఏర్పాటుచేసి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అందిస్తుందని కోన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దబ్బుకూటి ఏడుకొండలు, మాజీ సర్పంచ్ లక్ష్మీ సామ్రాజ్యం, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, చింతాయపాలెం సొసైటీ అధ్యక్షుడు మరకా పెదవెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రాతంశెట్టి లక్ష్మణరావు, నాయకులు మందపాటి పరమానందకుమార్, పేరాల వెంకట సురేష్, అక్కల రామిరెడ్డి, మార్పు బెనర్జి, యారం ఇసాక్ తదితరులు ఉన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘుపతి

ఆక్వా అథారిటీ చట్టంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి సురేష్

కర్లపాలెం: కేంద్ర ప్రభుత్వం సవరించిన ఆక్వా కల్చర్ అథారిటీ చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మత్స్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ సురేష్ చెప్పారు. కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం ఆక్వా రైతులకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టం ప్రకారం ఐదు హెక్టార్ల విస్తీర్ణంలోని ఆక్వా చెరువులను రెవెన్యూ డివిజన్ అధికారి అధ్యక్షతన రిజిస్ట్రేషన్ చేయటానికి కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ సిఫార్సు చేయవచ్చునని చెప్పారు. ఐదు హెక్టార్లకు మించి ఎక్కువ ఉండే చెరువులకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా స్థాయి కమిటీ కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీకి సిఫార్సు చేయవచ్చని తెలిపారు. అసైన్డ్ భూములు, సొసైటీ భూములలో ఉన్న చెరువులకు రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. ఉప్పునీటి చెరువులు లైసెన్సును పోగొట్టుకున్న రైతులు తిరిగి నకలు పొందే సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. అనధికారికంగా ఉప్పునీటి చెరువులు సాగు చేస్తున్న రైతులకు రూ.లక్ష జరిమానా కానీ మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించే అవకాశం ఉందని డాక్టర్ సురేష్ హెచ్చరించారు. సాగు చేస్తున్న ఆక్వా రైతులంతా తప్పనిసరిగా ప్రభుత్వ లైసెన్సులు తీసుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ డైరక్టర్ శంకర్‌రావు, డెప్యూటీ డైరక్టర్ పి.లక్ష్మణరావు, ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు కేవీఆర్, రొయ్యల హేచరీ సంఘం అధ్యక్షుడు సంజయ్, మత్స్యశాఖ సిబ్బంది, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

ఆసరా సొమ్మును సత్వరం ఖాతాల్లో జమ చేయాలి

డీఆర్‌డీఏ పీడీ సీహెచ్.కృష్ణ



సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కృష్ణ

కొల్లూరు : డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం విడుదల చేసిన 4వ విడత ఆసరా సొమ్మును వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ అయ్యేలా వెలుగు సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ సీహెచ్.కృష్ణ ఆదేశించారు. శుక్రవారం కొల్లూరులోని మథర్ థెరీసా మండల సమాఖ్య కార్యాలయంలో నియోజకవర్గంలోని కొల్లూరు, అమృతలూరు, చుండూరు, వేమూరు మండలాల వెలుగు సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నవరత్నాల పథకాల హామీలో భాగంగా డ్వాక్రా మహిళలకు విడుదల చేసిన ఆసరా పథకం నగదు బ్యాంకర్లతో మాట్లాడి ఈనెల 15లోపు లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో జమ య్యేలా చూడాలన్నారు. వెలుగు సిబ్బంది నిరంతరం బ్యాంకర్లను సమన్వయం చేసుకుంటూ మహిళల సొమ్ము ఖాతాల్లోకి జమ చేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. అదే విధంగా నగదు బకాయిలున్న డ్వాక్రా సంఘాలను గుర్తించి తక్షణం వారి వద్ద నుంచి స్త్రీనిధి, ఉన్నతి ద్వారా పొందిన రుణాలను, లోన్ రుణాలను జమ చేయించాలన్నారు. ప్రస్తుతం బ్యాంక్ రుణం పొందడానికి అర్హత గల సంఘాలున్న పక్షంలో వెంటనే వారికి రుణాలు ఇప్పించాలని సూచించారు. పాడి గేదెల పెంపకంపై ఆసక్తి ఉన్న డ్వాక్రా మహిళలకు సీసీఎల్ (క్యాష్ క్రెడిట్ లిమిట్) విధానంలో బ్యాంకర్లతో చర్చించి రుణం ఇప్పించడం ద్వారా గేదెలు కొనుగోలు చేసి వారికి జీవనోపాధి ఏర్పాటు చేయడంపై వెలుగు సిబ్బంది దృష్టి సారించాలని ఆదేశించారు. తొలుత మండలంలోని దోనేపూడి సచివాలయ పరిధిలో ఫింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుడికి ఆయన చేతుల మీదుగా ఫింఛన్ నగదు పంపిణీ చేశారు. సమావేశంలో ఏరియ కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, ఏపీఎంలు రాము, షాలెమ్‌రాజు, రాంబాబు, శోభన్, సీసీలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి స్ఫూర్తితో పేదలకు భరోసా

- పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- వేజండ్లలో 888 మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

వేజండ్ల (చేబ్రోలు): ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో పేదలకు నేత్ర జ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగులకు చేయూతల ద్వారా భరోసా కల్పిస్తున్నట్లు పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల జెడ్పీ హైస్కూల్ దగ్గర బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 25న 'నేత్రజ్యోతి' శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు 888 మందికి కళ్లజోళ్లు అవసరమని డాక్టర్లు నిర్ధారించడంతో శుక్రవారం వారికి ఉచితంగా అంబటి మురళీకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల బతుకులు బాగుండాలి... ప్రతి ఇంటిలో వెలుగులు నింపాలి అన్న ముఖ్యమంత్రి ఆకాంక్షలను తూచా తప్పకుండా పాటించి ఆయన మన్ననలకు ఇంకా చేరువవుతానని తెలిపారు. ఆయన అడుగులో అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్న తనను గుర్తించి పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించటం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

బజరంగ్ ఫౌండేషన్ ద్వారా అంకిత భావంతో ప్రజాసేవను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బజరంగ్ సేవా బృందం సభ్యులు, గ్రామస్తులు, స్థానిక పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో విజయం మనదే...

పొన్నూరు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, ఆయన చేసిన మేలును మరువకుండా పొన్నూరు ప్రజలు వైఎస్సార్ సీపీని విశేషంగా ఆదరిస్తున్నారని సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఐదో వార్డుకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు షేక్ పెద్ద గఫారి, వార్డు ప్రజలు మామిళ్లపల్లిలోని నివాసంలో అంబటి మురళీకృష్ణ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గఫారి మాట్లాడుతూ పెత్తందారి వ్యవస్థలో ఇమడలేక ఎన్నికలకు ముందు పాదయాత్రలో జగన్ పొన్నూరు వచ్చిన సందర్భంలో పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించే విధంగా కృషి చేయాలని అంబటి మురళీకృష్ణ కోరారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ జానీ బాషా, సుభాని, అస్మతుల్లా, బాషా, సమీర్ పాల్గొన్నారు.

- పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణను పార్టీ బాపట్ల నియోజకవర్గం పరిశీలకులు డాక్టర్ నల్లమోతు రూత్ రాణి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొని మురళీకృష్ణకు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.



వృద్ధుడికి కళ్లజోడు పంపిణీ చేస్తున్న అంబటి మురళీకృష్ణ

ఓటు హక్కు వినియోగంపై కళాజాత

బాపట్ల: ఓటు వేద్దాం..ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. దీనిపై ఈ నెల 3న బాపట్లలో కళాజాత ఆధ్వర్యంలో ప్రదర్శన ఉంటుందని కోట తెలిపారు. స్థానిక జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు లింగం జయరాజు, పల్లపోలు నాగ మనోహర లోహియా, పి రాజ్ కుమార్, బక్క జయరామిరెడ్డి, బి ప్రతాప్, సుబ్బారావు, ఇస్సాకు, ఇ.రమణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సేవాభావంతో పనిచేయాలి

పిట్టలవానిపాలెం: అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించేలా వలంటీర్లు కృషి చేయాలని ఎంపీడీఓ ఎంవీ.రమణమూర్తి సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన భవనంవారిపాలెం సచివాలయం పరిధిలోని వలంటీర్‌కు ఎంపికై నట్లు ధృవీకరణ పత్రాన్ని శుక్రవారం అందజేశారు.ఆయన మాట్లాడుతూ భవనంవారిపాలెం సచివాలయ పరిధిలో ఒక వలంటీర్ పోస్టుకు నోటిఫికేషన్ జారీ చేయగా నున్న హేమలత ఒక్కరే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆమెను వలంటీర్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఎంపీపీ పదవికి షేక్ బాజీ రాజీనామా

పిట్టలవానిపాలెం: మండల పరిషత్ అధ్యక్షుడు షేక్ బాజీ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మండల పరిషత్ అధ్యక్ష పదవిని పిట్టువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు దెందుకూరి సీతారామరాజుకు రెండున్నరేళ్లు ఇచ్చే విధంగా ఒప్పందం జరిగినట్లు తెలిపారు. అందులో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం తనపదవీ కాలం పూర్తి అయిందని చెప్పారు. బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి ఆదేశాల మేరకు తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని జిల్లా పరిషత్ సీఈఓకు అందజేయనున్నట్లు తెలిపారు.

భవనంవారిపాలెంకు వైస్ ఎంపీపీ

భవనంవారిపాలెం ఎంపీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సింధుకు వైస్ ఎంపీపీ పదవి వరించనుందని పార్టీ నాయకులు చెబుతున్నారు.ఇప్పటి వరకు వైస్ ఎంపీపీగా పనిచేసిన సీతారామరాజు ఎంపీపీ పదవి చేపట్టిన తర్వాత దొంతిరెడ్డి సింధును వైస్ ఎంపీపీగా ఎన్నుకుంటారని సమాచారం.

6న మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఈ నెల 6న ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జేవీబీ మల్లిఖార్జునరావు శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, హాజరు కావాలని కోరారు. అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

ప్రత్తిపాడు: యువత క్రీడల్లోనూ రాణించాలని జేఎన్‌టీయూకే డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్స్ బి. బాలకృష్ణ సూచించారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సంస్కృతి-2024 జాతీయ స్థాయి కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్ ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు శాంతి కపోతాల్ని ఎగురవేసి ప్రారంభించగా, ముఖ్య అతిథిగా హాజరైన బి. బాలకృష్ణ క్రీడా జ్యోతిని వెలిగించి పోటీల్ని ఆరంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో అకడమిక్స్‌తో పాటు క్రీడలనూ ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. విద్యార్థులంతా క్రీడలతో పాటు ఫెస్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ రోజు రోజుకీ టెక్నాలజీ అభివృద్ధి చెందుతోందని, యువత దాన్ని అందిపుచ్చుకుని, ఆలోచనాశక్తిని పెంచుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న నిపుణ్యాల్ని వెలికి తీసేందుకు ఏటా కళాశాలలో సంస్కృతి ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫెస్ట్‌కు పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి నాలుగు వేల మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రోగ్రాం కన్వీనర్ గోనుగుంట్ల రామస్వామి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు , డీన్ పోపూరి రమేష్ బాబు, ప్రొఫెసర్ జంపని కిశోర్‌బాబు, కో కన్వీనర్లు దొమ్మేటి విజయసారథి, హరికృష్ణ, కందెపు సునీత, ఆయా విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్‌ట్రానిక్స్ కంపెనీకి కళ్లం విద్యార్థి ఎంపిక

గుంటూరు రూరల్: ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగానికి తమ కళాశాల విద్యార్థి ఎంపికవ్వటం సంతోషకరమని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విద్యార్థి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాలకు చెందిన ఈదర నాగార్జున ఎఫ్‌ట్రానిక్స్‌లో ఏడాదికి రూ 5.30 లక్షల వేతనంతో ఎంపికవ్వటం అభినందనీయమన్నారు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ బి.ఎస్.బి.రెడ్డి, ఉపాధికల్పనాధికారి పి.ఎల్. మాధవరావు అభినందించారు.

నేలలో సేంద్రియ పదార్థం పెంచాలి

గుంటూరు రూరల్: నేలలో సేంద్రియ పదార్థం తప్పనిసరిగా పెంచాలని వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ కె. రామచంద్రం తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతు నేస్తం ఫౌండేషన్‌లో శుక్రవారం రైతులకు మూడు రోజులపాటు సేంద్రియ వ్యవసాయంపై నిర్వహించనున్న శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సేంద్రియ వ్యవసాయం ఎంతో అవసరమని తెలిపారు.

సీఎం జగన్ పాలనలో పేదోడి కల సాకారం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి గణేష్



ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న డాక్టర్ ఈవూరి గణేష్

రేపల్లె రూరల్: పేదవాడికి కనీస అవసరాలను తీర్చాలన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. 'సిద్ధం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోర్లవారిపాలెం పంచాయతీలోని తురకపాలెంలో శుక్రవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. నవరత్న పథకాలతో పేదల జీవితలలో వెలుగులు నిండాయన్నారు. ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరేలా జగనన్న పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రస్తుతం అమలవుతున్న పథకాలతో పాటు మరిన్ని పథకాలను రూపొందించి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతారన్నారు. భవిష్యత్ భరోసా కోసం ప్రతి ఒక్కరూ జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఈవూరి కేశవతి, సృజన్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, వైద్య సిబ్బంది



కొల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పెసర్లంక(భట్టిప్రోలు): చిన్నారులకు వేసే రెండు పోలియో చుక్కలు వారి నిండు జీవితానికి రక్షణ ఇస్తాయని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు పీహెచ్‌సీ పరిధిలోని పెసర్లంకలో దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో శుక్రవారం వైద్యురాలు సీహెచ్ రామలక్ష్మి ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ చిన్నారులు అంగవైకల్యానికి గురి కాకుండా చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని శతశాతం పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. వైద్యురాలు రామలక్ష్మి మాట్లాడుతూ వెల్లటూరు పీహెచ్‌సీ పరిధిలోని హైరిస్క్ ఏరియాలైన ఇటుక బట్టీలలో పని చేస్తున్న కార్మికులకు చెందిన చిన్నారులకు చుక్కలు వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఆయా రూట్లలో మొబైల్ టీంలు పల్స్ పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేవీబీ మల్లిఖార్జునరావు, పంచాయతీ కార్యదర్శి ఎ. రమాదేవి, వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లూరు : చిన్నారుల బంగారు భవితవ్యానికి పోలియో చుక్కల మందు దోహదపడుతుందన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలకు చుక్కల మందు వేయించాలని కొల్లూరు ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ కోరారు. శుక్రవారం కొల్లూరు పీహెచ్‌సీలో పల్స్‌పోలియో చుక్కల మందుపై వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. వైద్యాధికారి రవిబాబు మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని 2,245 మంది చిన్నారులకు 27 బూత్‌ల ద్వారా మందు పంపిణీ చేయడానికి 115 మంది సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. తొలుత గ్రామంలో అవగాహన కల్పించేందుకు ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకుమారి, ఎంఈఓ-2 జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

అవ్వా తాతలకు అందిన పింఛన్లు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో శుక్రవారం తెల్లవారక ముందే 5 గంటల నుంచి మండలంలోని 12 సచివాలయాల పరిధిలోని వలంటీర్లు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. ఉదయం 11 గంటలకే దాదాపు పింఛన్లు పంపిణీ పూర్తయింది. కొందరు పింఛన్‌దారుల ఇంటి వద్ద లేకపోవడంతో వారు పనులు చేస్తున్న చోటకు వెళ్లి పింఛన్లు అందచేశారు. ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు సైతం పింఛన్లు పంపిణీ చేశారు.

వేమూరు: వేమూరు మండలంలో ఫించన్ల పంపిణీ 79.23 శాతం పూర్తి చేయడం జరిగిందని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మండలంలోని 7,466 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. వలంటీర్లు శుక్రవారం ఉదయం నుంచి ఫించన్ల పంపిణీ చేపట్టారు.

కొల్లూరు : ప్రభుత్వం ప్రతి నెలా మొదటి తేదీనే పంపిణీ చేస్తున్న ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెల్లవారు జాము నుంచి వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఫించన్లను అందజేశారు. కదలలేని స్థితిలో ఉన్న అవ్వా తాతలకు ఇంటికి వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందించడంతో వారంతా హర్షం వ్యక్తం చేశారు.

దేశాభివృద్ధిలో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర కీలకం

ఏఎన్‌యూ: దేశాభివృద్ధిలో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర ఎంతో కీలకమని ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో 'నెట్‌వర్కింగ్ అండ్ ఇంటర్‌ఫేసింగ్ ఆఫ్ నాన్- గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ ఫర్ కన్వర్జెన్స్ ఇన్ సోషల్ ఏక్షన్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం యూనివర్సిటీలో ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ సోషియాలజీ, సోషల్ వర్క్ విద్యార్థులు, పరిశోధకులు ప్రజలకు సేవ చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి దానినే కెరీర్ గా ఎంచుకోవాలని సూచించారు.తమిళనాడు కోయంబత్తూర్ భారతీయార్ వర్సిటీకి చెందిన ఆచార్య సి. వెంకటాచలం కీలకోపన్యాసం చేస్తూ ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేసిన కోవిడ్ మహమ్మారిని తరిమికొట్టడంలో , వృద్ధులు, స్త్రీ శిశు సంక్షేమం, మహిళా సాధికారత, భద్రతలో ఎన్జీవోలు అందిస్తున్న కృషి ఘనమైనదని తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పట్నంబజారు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పాత గుంటూరు పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడికి చెందిన ఎం.జగన్ సుబ్బారావు గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సుద్దపల్లి డొంక ప్రాంతంలో దాడి చేసి ఆటోలో తరలిస్తున్న మూడు టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.